పిల్లల సంరక్షణకు 1098

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అధికారులు

ఖమ్మం, ఫిబ్రవరి 19: పిల్లల సంరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. పిల్లల సంరక్షణకు ఉద్దేశించిన 1098 టోల్ ఫ్రీ నంబర్‌పై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ చివరి త్రైమాసిక పనితీరుపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పిల్లల సంరక్షణకు సంబంధించి మండల స్థాయిలో సమావేశాలు తప్పనిసరిగా జరిగేలా తహసీల్దార్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని అన్నారు. గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై చిన్న పిల్లలకు; సామాజిక మాధ్యమాల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, అపరిచితులకు దూరంగా ఉండాల్సిన అవసరాన్ని హైస్కూల్ స్థాయి పిల్లలకు వివరించాలని అన్నారు. పిల్లలపై మానసిక, శారీరక దాడుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు వాట్సాప్ తదితర మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. 1098 చైల్డ్ లైన్ నంబర్ కు వచ్చే సమాచారం పూర్తి స్థాయిలో గోప్యంగా ఉంటుందన్న విషయాన్ని ప్రజలందరికీ తెలపాలన్నారు. చైల్డ్ లైన్ హెల్ప్‌లైన్‌కు వచ్చే ఫోన్ కాల్స్‌ను వెంటనే రిసీవ్ చేసుకోవాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో, ముఖ్యమైన ప్రాంతాల్లో 1098 నంబర్ ప్రముఖంగా కనిపించేలా పెయింటింగ్స్ వేయించాలన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థినులు ఫిర్యాదు చేసేందుకు వీలుగా కంప్లయింట్ బాక్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఆ బాక్స్‌లోని ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అనాథలు, తల్లిదండ్రుల్లో ఒక్కరు మాత్రమే ఉన్న పిల్లలు పదోతరగతి తర్వాత కూడా చదువు కొనసాగించేలా కార్యాచరణ అమలు చేయాలని చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు 100 మీటర్ల పరిధిలోగల మద్యం దుకాణాలను తరలించాలని, లేనట్లయితే వాటి లైసెన్స్ రద్దు చేయాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ/ప్రైవేట్ కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులపై వేధింపుల నివారణకు అంతర్గత కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీసీపీ నరేష్ కుమార్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి కె.రాంగోపాల్ రెడ్డి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతి బాయి, డీఎస్‌సీడీవో కస్తాల సత్యనారాయణ, ట్రైబల్ వెల్ఫేర్ ఉప సంచాలకులు ఎన్.విజయలక్ష్మి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్, ఆర్డీవోలు నరసింహారావు, ఎల్.రాజేందర్, అడిషనల్ డీఆర్‌డీవో నూరొద్దీన్, విద్యాశాఖ సీఎంవో రాజశేఖర్, డీఎంసీడీహెచ్ ఈడబ్ల్యూ సమ్రిన్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణపై ప్రచారం చేయాలి

వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలలో విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. వడగాల్పుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి బుధవారం వైద్య శాఖ టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని, గత ఏడాది దాదాపు 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని చెప్పారు. వృత్తులవారీగా ఎండలో పనిచేసే నిర్మాణ కార్మికులు, రోజువారీ/ఉపాధి హామీ పథకం కూలీలు, పారిశుద్ధ్య కార్మికులు తదితరుల వివరాలు సేకరించాలని అన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వడదెబ్బ తగిలే హై రిస్క్ ఏరియాలను గుర్తించాలన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు, హమాలీలకు, సిబ్బందికి వడదెబ్బ తగలకుండా ఏర్పాట్లు ఉండాలని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. బస్టాపులు, రైల్వే స్టేషన్ వద్ద చల్లని తాగునీరు ఉంచాలని అన్నారు. ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు, వార్డ్ అధికారుల వద్ద కూడా ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉండాలని చెప్పారు. నగరంలోని ముఖ్యమైన కూడళ్లలో, ఆటో స్టాండుల వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. బస్ డ్రైవర్లకు, కండక్టర్లకు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో, పాఠశాలల్లో తప్పనిసరిగా ఫ్యాన్లు ఉండేలా చూడాలన్నారు. విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులుత పాల్గొన్నారు.

ఉషు పోటీల్లో పవిత్రాచారికి 'స్వర్ణ'ం

గోల్డ్‌మెడల్ సాధించిన పవిత్రాచారి

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 19: ఆదిలాబాద్ జిల్లాలోని ఇందిరా ప్రియదర్శిని ఇండోర్ స్టేడియంలో బుధవారం జరిగిన ఖేలో ఇండియా రాష్ట్ర స్థాయి ఉషు పోటీల్లో మహిళల లీగ్ సీనియర్ విభాగంలో జిల్లాకు చెందిన పొడకంటి పవిత్రాచారి స్వర్ణ పతకం గెలుచుకుంది. నాన్ దావో(ఈవెంట్)లో గోల్డ్‌మెడల్ సాధించి, ఖేలో ఇండియా జాతీయ స్థాయి పోటీలకు అర్హత పొందారు. పవిత్రాచారిని, ప్రధాన కోచ్ పి.పరిపూర్ణాచారిని జిల్లా యువజన, క్రీడల అధికారి తుంబూరు సునీల్‌రెడ్డి అభినందించారు.

ఖమ్మం బ్లాక్ లెవల్ క్రీడలు విజయవంతం

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 19: నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఖమ్మం బ్లాక్ లెవల్ క్రీడాపోటీలు బుధవారం విజయవంతంగా ముగిశాయి. వీటిని నెహ్రూ యువ కేంద్రం, తెలంగాణ గ్రాడ్యుయేట్స్ యూత్ అసోసియేషన్ నిర్వహించాయి. విజేతలకు బహుమతులను జిల్లా యువజన, క్రీడల అధికారి తుంబూరు సునీల్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ మేనేజర్ ఉదయ్‌కుమార్, నెహ్రూ యువ కేంద్రం అకౌంట్స్ ఆఫీసర్ కమర్తపు భానుచందర్, కోచ్ అక్బర్ ప్రదానం చేశారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఎస్‌వో చందన్‌కుమార్

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 19 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి చందన్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన ఖమ్మంరూరల్ మండలంలో పర్యటించి ఆకస్మిక తనిఖీలు చేశారు. తొలుత ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని జలగంనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వరంగల్ క్రాస్‌రోడ్డు రైస్‌మిల్లు, పెట్రోల్‌బంక్‌లలో తనిఖీ చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఏజెన్సీలు నాణ్యమైన బియ్యం, తాజా కూరగాయలు, గ్రుడ్లు సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయి డీటీ విజయ్‌బాబు, మెచ్చు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో డీఎస్‌వో తనిఖీ

రఘునాథపాలెం, ఫిబ్రవరి 19: నగరంలోని శ్రీశ్రీశ్రీ పెట్రోల్ బంకును బుధవారం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొలతల ప్రకారం పెట్రోల్, డీజిల్ పోస్తున్నదీ లేనిదీ తెలుసుకునేందుకు శాంపిల్ తీసి పరీక్షించారు. బంక్ నిర్వహణలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని బాధ్యులను హెచ్చరించారు. తూనికలు-కొలతల శాఖ అధికారులు, ఖమ్మం అర్బన్ సివిల్ సప్లై డీటీ హెచ్.వెంకటేశ్వర్లు, ఖమ్మం రూరల్ డీటీ విజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ అందరి ఆరాధ్యదైవం

ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

బంజార నాయకులతో కలిసి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

కారేపల్లి, ఫిబ్రవరి 19 : కారేపల్లి మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మండల కేంద్రానికి చేరుకున్న ఎమ్మెల్యేకు బంజారా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి నుదుటిన తిలకం దిద్ది ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహరాజ్ కేవలం గిరిజనుల ఆరాధ్య దైవం మాత్రమే కాదని, అందరికీ ఆరాధ్యుడేనన్నారు. గిరిజనులకు దశ-దిశను చూపి, హైందవ ధర్మం గొప్పతనం, విశిష్టతలను తెలియజేయడానికే సేవాలాల్ మహరాజ్ జన్మించినట్లు చరిత్రకారులు చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బంజారా గిరిజన సంఘం నాయకులు, నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హిమాంనగర్‌లో..

వైరాటౌన్, ఫిబ్రవరి 19 : ఏన్కూరు మండలం హిమాంనగర్ గ్రామంలో సద్గురు శ్రీసంత్‌సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు బంజారా నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు, మీడియా ప్రతినిధులు, బంజారా నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు

వైరా కేవీకే శాస్త్రవేత్త రవికుమార్

రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 19 : పంట పొలాల్లో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు పొందవచ్చని వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్ అన్నారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గుర్రాలపాడు రైతులకు కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం హైదరాబాద్ వారు అవగాహన కల్పించారు. క్షేత్ర పాఠశాలలో భాగంగా రవికుమార్ అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఉదయశంకర్‌తో కలిసి పలు అంశాలపై వివరించారు. వ్యవసాయంలో మిత్రపురుగుల వల్ల కలిగే లాభనష్టాలు, విత్తనశుద్ధి ద్వార కలిగే ప్రయోజనాలు, వరిలో వెదజల్లే పద్ధతి తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ బసవన్న, మండల వ్యవసాయశాఖ అధికారి ఉమానగేష్, ఏఈవో ఆదర్శ్‌తోపాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

పంటల డిజిటల్ సర్వే పరిశీలన

రైతుల వివరాలు సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

మధిర, ఫిబ్రవరి 19 : రైతులు సాగు చేస్తున్న పంటలను ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ అధికారులు డిజిటల్ సర్వే చేపట్టారు. బుధవారం మధిర నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు చేస్తున్న డిజిటల్ సర్వేను మధిర వ్యవసాయ ఉపసంచాలకులు స్వర్ణ విజయచంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రతి పంటను నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏవో కనకం సాయిదీక్షిత్, వ్యవసాయ విస్తరణ అధికారులు అమృత, జిష్ణు, రైతులు పాల్గొన్నారు.

పట్టా భూమిలో రోడ్డు నిర్మాణం!

తహసీల్దార్‌కు బాధితుల ఫిర్యాదు

తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

ముదిగొండ, ఫిబ్రవరి 19 : తమ భూమిలో అక్రమంగా రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని పలువురు రైతులు తహసీల్దార్ సునీత ఎల్జెబిత్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బాణాపురం గ్రామానికి చెందిన కర్నెబాబు, వీరబాబు సోదరులకు కమలాపురం రెవెన్యూ పరిధిలో వ్యవసాయ భూమి ఉంది. ఇటీవల కమలాపురం శివారు నుంచి వెంకటాద్రి చెరువు వరకూ పంచాయతీరాజ్‌శాఖ కిలోమీటరు తారురోడ్డు మంజూరు చేసింది. వీరి పంట ధ్వంసం చేసి మరీ రోడ్డు నిర్మాణం పనులు చేస్తున్నారు. దీంతో తమకు న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు.

రేపు 'ఉమ్మడి' రెజ్లింగ్ పోటీలు

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 19: ఈ నెల 21న కొత్తగూడెం శ్రీ ఇంక్లైన్‌లోగల తెలంగాణ క్రీడా మైదానంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల స్థాయి రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రధాన కార్యదర్శి కాశీహుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 10, 12, 14, 17, 19 బాలబాలికలకు అన్ని బరువు కేటగిరీ విభాగాల్లో పోటీలు ఉంటాయని వివరించారు. వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డులతో ఉదయం 8.00 గంటలకు గ్రౌండ్‌లో రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన రెజ్లింగ్ క్రీడాకారులను సన్మానించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 8309529743 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

టేకులపల్లి, ఫిబ్రవరి19: మండలంలోని బొమ్మనపల్లి ముర్రేడు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను టేకులపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై పోగుల సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ముర్రేడువాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బోడు రోడ్డు సెంటర్‌లో పట్టుకొని బానోత్ శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే సహించం

విలేకరులతో మాట్లాడుతున్న కారేపల్లి గ్రామస్తులు

కారేపల్లి, ఫిబ్రవరి 19 : మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే సహించేది లేదని కారేపల్లి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం పక్కన ఉన్న సర్వేనెంబర్ 38లో గల ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని బుధవారం అక్కడ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ స్థలాన్ని ప్రభుత్వం బీసీ, ఎస్టీ, ఎస్సీ హాస్టల్‌కు కేటాయించినట్లు తెలిపారు. ఈ విషయమై అధికారులకు వినతిపత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో నారాయణ, రాంబాబు, శ్రీనివాసరావు యాదవరావు, నరసయ్య, శీను, మల్లయ్య, సీతారాములు, కోటేశ్వరావు, గోపి, వెంకన్న, రాంబాబు, అశోక్‌కుమార్, రమేష్, బసవకుమార్, నరసింహారావు, ప్రభాకర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వరిలో తెగులును నివారించాలి

ఈశ్వరమాదారంలో వరి పొలాలను పరిశీలిస్తున్న వాణి

కూసుమంచి, ఫిబ్రవరి 19 : వరి పొలాల్లో కాండం తొలిచే పురుగు, అగ్గితెలుగు నివారణకు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయశాఖ అధికారి రామడుగు వాణి రైతులకు సూచించారు. ఈశ్వరమాదారంతోపాటు పలు గ్రామాల్లో బుధవారం పర్యటించిన ఏవో మాట్లాడుతూ కాండం తొలిచే పురుగు అంకురం నుంచి చిరు పొట్టదశలో ఆశిస్తే ఈనే దశలో పోషకాలు అందక నష్టం జరుగుతుందన్నారు. ఏఈవో సౌమ్య, రైతులు పాల్గొన్నారు.

లంకాసాగర్ నుంచి కట్టలేరుకు నీరు వదలాలి

ఎండిపోతున్న పంటలను పరిశీలిస్తున్న సీపీఎం, రైతుసంఘం నాయకులు

ఎర్రుపాలెం, ఫిబ్రవరి 19 : లంకాసాగర్ నుంచి కట్టలేరుకు నీటిని వదిలి మండలంలో ఎండిపోతున్న పంటలను కాపాడాలని సీపీఎం రైతుసంఘం జిల్లా నాయకులు దివ్వెల వీరయ్య కోరారు. బుధవారం సీపీఎం మండల కమిటీ, రైతుసంఘం ఆధ్వర్యంలో మండలంలోని మామునూరు గ్రామంలో వరి, మొక్కజొన్న పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కట్టలేరు ఆయకట్టు కింద వేలాది ఎకరాల మొక్కజొన్న, వరి పొలాలు సాగు జరుగుతున్నదని, కట్టలేరులో నీరు లేక పొలాలు నెర్రెలు బారి పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా నాయకులు గొల్లపూడి నారాయణ, అమల మోక్షానందం, కొమ్మినేని రామారావు, శీలం రంగారావు, వెంకటేశ్వరరావు, బాపయ్య, గోపి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

ఖమ్మం, ఫిబ్రవరి 19: ఇటీవల ఆత్మహత్య చేసుకున్న చింతకాని మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన గిరిజన కౌలు రైతు నేరసూల ఎల్లయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య డిమాండ్ చేశారు. ఆయన బుధవారం నగరంలోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. మూడెకరాల మాగాణి భూమిని ఎల్లయ్య కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడని చెప్పారు. కాలువ ఆధారిత చివరి భూమి కావడంతో కాలువ నీళ్లు అందక వరి ఎండిపోయిందని, అప్పులపాలయ్యాడని చెప్పారు. పంట నష్టం, అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడని వివరించారు. చింతకాని మండలంలో ఇప్పటికే నలుగురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారి కుటుంబాలను ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పరామర్శించలేదని విమర్శించారు. ఎల్లయ్య చావుకు ప్రభుత్వానిదే బాధ్యతని అన్నారు. ముదిగొండ మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, చింతకాని మాజీ వైస్ ఎంపీపీ గురిజాల హనుమంతరావు, నాయకులు మంకెన రమేష్, గడ్డం శ్రీను, సంచు విజయ్, చింతాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహ సంక్షేమాధికారుల కమిటీ ఎన్నిక

ఖమ్మం, ఫిబ్రవరి 19: వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం జిల్లా నూతన కమిటీని బుధవారం జరిగిన సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. అధ్యక్షుడిగా కోటపాటి రుక్మారావు, కార్యదర్శిగా నెల్లూరి నాగేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా బజ్జూరి వెంకటేశ్వరరావు, కోశాధికారిగా కంభం తిరుపతిరావు, ఉపాధ్యక్షులుగా కె.వీరభద్రరావు, ఎస్.వెంకట్ రెడ్డి, ఎం.కోమలి, సహాయ కార్యదర్శులుగా కె.వెంకటేశ్వరరావు, ఆర్.నాగరాజు, పి.మాధురి, నిర్వాహక కార్యదర్శిగా సిహెచ్.నాగమణి, ప్రచార కార్యదర్శిగా జి.వినోద, క్రీడల కార్యదర్శిగా ఐ.జ్యోత్స్న, కార్యాలయ కార్యదర్శిగా టి.స్టాలిన్, కార్యవర్గ సభ్యులుగా జి.వెంకటేశ్వర్లు, ఎం.వెంకటకృష్ణ, పి.కృష్ణ కిరణ్, జె.నరసింహారావు ఎన్నికయ్యారు. టీఎన్జీవోల సంఘం భవనంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి కొణిదేన శ్రీనివాస్, వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.గౌస్ హష్మీ పాల్గొన్నారు. ఎన్నికల అధికారిగా టీఎన్జీవోస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.దుర్గాప్రసాద్ వ్యవహరించారు.

నివాళులర్పించిన మాజీ మంత్రి పువ్వాడ

ఖమ్మం, ఫిబ్రవరి 19: నగరంలో ఇటీవల మృతిచెందిన పలువురికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ బుధవారం నివాళులర్పించారు. ఖమ్మం మాజీ కార్పొరేటర్ మచ్చా నరేందర్ సతీమణి శోభారాణి, బీఆర్ఎస్ నాయకుడు టేకులపల్లి పొదిల పాపారావు సతీమణి పార్వతి, సీపీఐ నాయకుడు పుచ్చకాయల కృష్ణ మనవడు గీతాన్ష్.. ఇటీవల మృతిచెందారు. వారి కుటుంబీకులను పరామర్శించారు. మృతుల చిత్రపటాల వద్ద పూలు చల్లి నివాళులర్పించారు. పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు కూరాకుల నాగభూషణం, నాగచంద్రారెడ్డి, కార్పొరేటర్లు నాగండ్ల కోటేశ్వరరావు, కూరాకుల వలరాజు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

రఘునాథపాలెం, ఫిబ్రవరి 19: తెలంగాణ ప్రగతిశీల హమాలీ, మిల్లు కార్మికుల సంఘం 4వ రాష్ట్ర మహాసభలు నగరంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 21న జరగనున్నాయి. ఈ మహాసభల వాల్ పోస్టర్‌ను ఖమ్మం ఏరియా కార్యదర్శి శ్రీనివాస్ బుధవారం ఆవిష్కరించారు. నాయకులు రమేశ్, వీరన్న, భద్రయ్య, శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.

ఆరు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 19 : మండలంలోని ఆకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను బుధవారం సాయంత్రం పోలీసులు పట్టుకున్నారు. అక్రమ ఇసుక తవ్వకాలపై 'నమస్తే'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన స్థానిక ఎస్‌ఐ కూచుపూడి జగదీష్ తన సిబ్బందితో వెళ్లి హైదర్‌సాయిపేట సమీపంలోని ఆకేరు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నారు. ట్రాక్టర్లను తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్య

సత్తుపల్లిటౌన్, ఫిబ్రవరి 19 : ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గంగారంలో బుధవారం చోటుచేసుకుంది. గంగారం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ ఎండీ నజీరుద్దీన్ గత కొన్నిరోజులుగా కిడ్నీ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. రెండునెలల క్రితం ఒక కిడ్నీ తొలగించగా మరో కిడ్నీకు కూడా సమస్య రావడంతో అప్పటినుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో మనస్థాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య జీనద్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సత్తుపల్లిటౌన్, ఫిబ్రవరి 19 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని కాకర్లపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న నాగళ్ల రామకృష్ణ(36) అనే వ్యక్తిని టీవీఎస్ మోపెడ్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామకృష్ణకు తీవ్రగాయాలు కాగా స్థానికులు ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. వాహనదారుడికి గాయాలుకావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందెంరాయుళ్లు అరెస్టు

ఎర్రుపాలెం, ఫిబ్రవరి 19 : మండల పరిధిలోని రేమిడిచర్ల శ్మశానవాటిక సమీపంలో కోడిపందాల స్థావరంపై దాడి చేసి పందెంరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎర్రుపాలెం ఎస్సై పి.వెంకటేష్ తెలిపారు. సిబ్బందితో కలిసి దాడి చేయడంతో 12 మందిని పట్టుకున్నామని, ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. వారి వద్ద రెండు కోడిపుంజులు, ఆరు మోటార్‌సైకిళ్లు, రూ.7 వేలు నగదును సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శివాజీ మహరాజ్‌కు నివాళి

మధిర, ఫిబ్రవరి 19 : ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను బుధవారం మధిర టీవీఎం ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్రీయ స్వయం సేవా సంఘ్ మధిర బాధ్యుడు భైరవబట్ల రాజేశ్వరరావు మాట్లాడుతూ తిరుగులేని యుద్ధ వ్యూహాలను అనుసరించడమే శివాజీ అసమాన ప్రతిభకు నిదర్శనమన్నారు. మధిర పట్టణ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, విద్యార్థులు, వాకర్స్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

CHANGE OF NAME

I, MOHAMMED NOORUNNISA (OLD NAME) CHANGED MY NAME AS NOORUNNISA (NEW NAME) W/O. MOHAMMED WALIUDDIN FAROOQUI R/O. H.NO. 20-5-113/1, CONTRACTORS COLONY, PALWANCHA - 507115, BHADRADRI KOTHAGUDEM DIST,TG . KMM

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ నాయకులు

బోనకల్లు, ఫిబ్రవరి 19 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పీఆర్‌టీయూ కృషి చేస్తున్నదని ఆ సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పుట్లూరు వెంకటరెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు మోత్కూరి మధు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల నుంచి పీఆర్‌టీయూ అభ్యర్థికి మంచి ఆదరణ లభిస్తున్నదని తెలిపారు. గత కేసీఆర్ ప్రభుత్వం హయాంలో మెరుగైన పీఆర్‌సీని సాధించడంలో తమ సంఘం పాత్ర కీలకమైందని గుర్తుచేశారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

బోనకల్లు, ఫిబ్రవరి 19 : గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని తహసీల్దార్ అనిశెట్టి పున్నంచందర్ ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని జ్యోతిరావుబాపూలే గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనాన్ని తయారుచేయాలన్నారు. అల్పాహారం, భోజనం సకాలంలో వడిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో దామాల పుల్లయ్య, ఆర్ఐ గుగులోతు లక్ష్మణ్, ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, ఉపాధ్యాయులుఉన్నారు.

ఆటోడ్రైవర్‌కు తీవ్రగాయాలు

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 19: రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. లక్ష్మీదేవిపల్లి మండలం సీతారాంపురానికి చెందిన లావుడియా హరికృష్ణ, తన ఆటోలో ఒక్కడే మంగళవారం రాత్రి భద్రాచలం వైపు వెళుతున్నాడు. మండలంలోని రంగాపురం వద్ద ఈ ఆటోను, మణుగూరు నుంచి పాల్వంచ వైపు వేగంగా వచ్చిన మినీ ట్రాలీ ఢీకొంది. ఆటో డ్రైవర్ హరికృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటో నుజ్జునుజ్జయింది. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ ఆస్పత్రికి కుటుంబీకులు తరలించారు. భార్య వాణిశ్రీ ఫిర్యాదుతో మినీ ట్రాలీ డ్రైవర్ కొండా రమేష్‌పై ఎస్సై సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

యువకుడి ఆత్మహత్య

జూలూరుపాడు, ఫిబ్రవరి 19: యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై కోటేశ్వరరావు తెలిపిన వివరాలు.. మండలంలోని జడలచింత గ్రామస్తుడు దుబ్బ అరవింద్‌కుమార్(20) కొంత కాలంగా ముభావంగా ఉంటున్నాడు. చచ్చిపోతానని తల్లిదండ్రులతో చెబుతున్నాడు. అతడికి తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు ధైర్యం చెబుతూనే ఉన్నారు. ఈ నెల 18వ తేదీ ఇంట్లోనే అతడు పురుగుల మందు తాగాడు. బుధవారం మృతిచెందాడు.